# చివరి మనుషులు

ఒక్కమాటడుగుతాను ఏమనుకోకండేం!

మా అంజిబాబు నెపుడయినా చూశారా అని...

ఆయనెవరండీ బాబూ! అని అనబోతారు మీరు. నాకు తెలుసు.

అంజిబాబు అఖిలాంధ్ర దేశానికి...తప్పు తప్పు యావద్భారతదేశానికే ఆదర్శ ప్రాయుడండీ... అవునూ... నేను చెబుతున్నది నిజం!

మరి, అవునో కాదో... నిజమో అబద్ధమో తేల్చుకోవాలంటే నేను చెప్పేది కొంచెం ఓపిగ్గా వినండి... విన్నాక వెదకండి. నేనతన్ని ప్రత్యేకంగా చూపాల్సిన అవసరం లేదు. మీరే వెదికి పట్టుకోగలరు. ఎక్కడా కనబడలేదా? బయట కనబడకపోతే మనసులో వెదకండి. మారుమూలలలో కనబడతాడేమో...

అంజిబాబు అచ్చమైన పదహారణాల తెలుగువాడు. అట్లా అనడానికి కారణం అతనికి తెలుగుమీద ఉన్న చులకన భావంతోపాటూ ఇంగ్లీషంటే అమితమైన ప్రేమ కలిగి ఉండటమే!

అయితే, ఇంగ్లీషుమీద అతనికి ప్రేమ ఉంది అనటంతో సరిపోదనీ అతనితో పరిచయమున్న ఎవరయినా చెప్పగలరు.

ఇష్టం, అభిమానం, వ్యామోహం, గౌరవం... ఇట్లా ఎన్ని చెప్పినా సరిపోదేమో, పోనీ భక్తి అంటేనో...

ఊహూ!...

వెర్రీ... పిచ్చీ... అంటేనో...

సరిగ్గా సరిపోవచ్చేమో గానీ అంతకంటే ఎక్కువ అని అర్థాన్నిచ్చే పదం తెలుగులో కాక, మరే ద్రవిడ భాషలోనో, ఆర్యభాషలోనో, లేదంటే కొరియా, అరబిక్, డచ్చి భాషల్లోనో ఉంటే దాన్ని నిస్సంకోచంగా వాడవచ్చు. అందుకు అంజిబాబు కూడా ఒప్పుకుంటాడు.

ఇట్లా అతనికి ఇంగ్లీషు మీద ప్రేమ పుట్టడానికి కొంత నేపథ్యం ఉంది.

అదేమంటే...

వాళ్ల తాతగారికీ, తండ్రిగారికీ సంస్కృతం మీద చెప్పలేనంత వెర్రి వ్యామోహం ఉండేది. అందువల్లే వాళ్లు సంస్కృత పండితులైనారు. సొంత భాష మీద కాకుండా పరాయి భాషమీద వ్యామోహం ఉండటం అన్నది జన్యుపరంగా సంక్రమించడంవల్ల అతనికి ఇప్పుడు సంస్కృతం స్థానంలో ఇంగ్లీషు వచ్చి కూర్చుంది. అయితే అంజిబాబు ఆంగ్ల పండితుడు కాలేదు. వృత్తిరీత్యా డిప్యూటీ తహసిల్దారు. ఈ జన్యుపరమైన విశ్లేషణ వాళ్ల బావ రామ్మూర్తి చెప్పినప్పుడు ఎంతో అద్భుతంగా అనిపించింది అంజిబాబుకి. బాగా గర్వించాడు కూడా. అప్పటినుంచీ మరింతగా ఇంగ్లీషుకి దగ్గరయ్యాడు.

ప్రపంచాన్నంతటినీ ఒక్కటిగా కలిపి కుట్టేది ఇంగ్లీషేననీ, అన్ని భాషలూ నశించిపోయి, ఒక్క ఇంగ్లీషు మనగలిగిన రోజున ప్రపంచ ప్రజలందరికీ ఒకే సంస్కృతీ, ఒకే సంప్రదాయం, ఒకే కట్టుబాటూ, ఒకే రకమైన ఆహారం, ఒకే రకమైన ఆహార్యంకూడా సాధ్యమౌతుంది అన్నది అతని ప్రగాఢ విశ్వాసం. నిజానికి తనకే గనక దండిగా డబ్బు ఉండి ఉంటే ఇంగ్లీషుని ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా ఉద్యమం సాగించి, తెలుగులాంటి ప్రాంతీయ భాషల్ని ఏడుమట్లు గుంతతీసి అందులో పాతిపెట్టాలని అతని చిరకాల వాంఛ!

చైనా, జపాన్, జర్మనీ వాళ్లని చూసినప్పుడూ, తమిళ, కన్నడ, బెంగాలీ వాళ్లను చూసినప్పుడూ అంజిబాబుకి ఒకటే ఆశ్చర్యం! ఏమిటి వీళ్ల చాదస్తం! ఇంకా ఆ దరిద్రపు భాషల్ని వదల్చుకోలేకపోతున్నారే...!

అయితే, మన రాష్ట్ర ప్రభుత్వ పాలకుల్ని చూసినప్పుడు మాత్రం భలే ముచ్చట పడతాడు అంజిబాబు. పార్టీలతో నిమిత్తం లేకుండా, ఏది అధికారంలోకి వచ్చినా తమ శాయశక్తులా తెలుగు భాషను తుంగలో తొక్కేస్తున్నందుకు అమితానందం పడిపోతుంటాడు.

ఎల్‌కేజీ స్థాయినుంచీ పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయి వరకూ తెలుగు అక్షరమ్ముక్క జోలికి పోకుండా పిల్లవాళ్లు తమ విద్యాభ్యాసాన్నంతా పూర్తి చేసుకోగలగిన అవకాశం ఒక్క మన రాష్ట్రంలోనే ఉండడం ఆయనకు ఎంతో ఆనందాన్నిస్తుంది. అది యావద్భారతం... కాదు కాదు యావత్ప్రపంచంలో ఏ భాషీయులూ చేయనీ, చేయలేనీ గొప్ప విషయంగా అప్పుడప్పుడు తన బంధువులతో, ఎప్పుడూ మిత్రులతో చెప్పుకుని అల్ప సంతోషాన్ని అనుభవిస్తూ ఉంటాడు కూడా.

ఇక్కడో విషయం... ఆశ్చర్యపోకండి.

అతను రోజూ తెలుగు పేపరే చదువుతాడు.

మరి, ఆంగ్ల పత్రిక తెప్పించుకోడా అని ఎవరైనా అడుగుతారు.

దానికి సమాధానం...

తెలుగు భాష, సంస్కృతి ఏరోజు కారోజు ఎంత పతనమైనదీ తెలియజేస్తూ ఉండేది తెలుగు పేపరేనని అంజిబాబుకి తెలుసు.

ఈ మధ్య ఒక నిజం తెలుసుకున్నాడు అతను. తన చిరకాల వాంఛ అచిరకాలంలో నెరవేర్చేందుకు ప్రపంచీకరణ అన్నది పెద్ద సునామీలా వచ్చిందనీ, అది అమెరికా సంస్కృతీ

సంప్రదాయాలనూ, ఇంగ్లీషు భాషనీ తప్ప వందలాది ప్రపంచ జాతుల సంస్కృతుల్నీ, వాటి మాతృభాషల్నీ కొట్టుకుపోయేలా చేస్తుందనీ, వీటి గురించి పేపర్ మీడియా ఆక్రోశిస్తుంటే తొలిసారిగా అంజిబాబు ఆనందతాండవమాడేడు.

ఒక ఆదివారం ఉదయం ఎప్పట్లాగే వరండాలో కూచుని కాఫీ తాగేసి సిగరెట్టుని అంటించుకుని తెలుగు పేపర్ తిరగేస్తున్నాడు. ఎన్నో ఉత్సాహకరమైన వార్తలు కనిపించేయి అతనికి.

"తెలుగు ప్రాథమిక పాఠశాలలు 550 మూసివేత."

"కొత్తగా 600 ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు ప్రభుత్వ అనుమతి"

"ఇక ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమమే!"

ఇట్లా సాగిపోతున్నాయి వార్తలు...

'ప్రపంచీకరణ - పదిహేను సంవత్సరాలు' అన్న వార్త జిల్లా ఎడిషన్‌లో కనబడడంతో పంటికింద రాయి పడ్డట్టు ఉలిక్కిపడి చదవడం ప్రారంభించేడు అంజిబాబు.

"అమెరికా వంటి సంపన్న దేశాలు పేద దేశాల సంపదల్నీ, మేధో సంపత్తినీ పెద్ద ఎత్తున కొల్లగొట్టేందుకు తయారు చేసిన నాటకమే 'ప్రపంచీకరణ'. ఇందులో మనమంతా పావులం కాబోతున్నాం" అలా సాగిపోయింది. ఆ వార్తలో, కమ్యూనిస్టు ప్రజాస్వామ్య వాదులు' ప్రపంచీకరణ'ని వ్యతిరేకించడంకోసం ఆరోజు ఉదయం 11 గంటలకు 'కృష్ణ కళా మందిరం'లో సభ జరుపుతున్నట్టు అర్థమయింది అంజిబాబుకి. వక్తలలో వాళ్ల బావగారు రామ్మూర్తి పేరు కూడా కనబడింది. 'అయితే బావ వస్తాడేమో!' అనుకున్నాడు. అట్లా అనుకున్నదే ఆలస్యం పద్మ వచ్చి చెప్పింది.

'ఏమండీ! రామ్మూర్తి అన్నయ్య ఫోన్ చేశాడు. బస్టాండునుంచి. మరో పదినిమిషాల్లో ఇక్కడ ఉంటాడంట' అంటూ.

"అట్లానా!" అన్నాడు, కొంచెం కంగారుతో.

"టిఫిన్ అన్నయ్యతో పాటే చేస్తారా" అంది ఇంట్లోకి వెళుతూ.

"ఇంకేం టిఫిన్ చేస్తానూ, ఆయనే నన్ను భోంచేస్తాడు కదా!" గొణిగాడు అంజిబాబు.

మొగుడివైపు చిత్రంగా చూసి లోపలికి వెళ్లింది పద్మ.

రామ్మూర్తి అంటే అంజిబాబుకి 'బావ' అన్న గౌరవంతోపాటూ కొంచెం భయం కూడా ఉంది. రామ్మూర్తి అందర్లాంటి మనిషి కాదు. మాటల్లో దూకుడు ఎక్కువ. ఎదుటి మనిషి అభిప్రాయం తప్పనిపిస్తే దాన్ని అట్లా ఇట్లా చెప్పడు. ముక్కుమీద గుద్ది మరీ చెబుతాడు. అదే అంజిబాబుకి నచ్చదు.

ఓసారి భోజన సమయంలో "ఇంగ్లీషు అంతటి గొప్ప భాష మరొకటి లేదు బావా!" అంటూ నోరు జారాడు అంజిబాబు. బావ ఇంగ్లీషు లెక్చరరే కదా అని.

"నోటికొచ్చినట్టు మాట్లాడవద్దురా! మనుషులు మాట్లాడే ప్రతి భాషా గొప్పదే. ఎన్నో కోట్లమంది మాట్లాడే ఇంగ్లీషు ఎంత గొప్పదో కేవలం కొన్ని లక్షలమంది మాట్లాడే కోయ భాషకూడా అంతే గొప్పది. అసలు నీ ఇంగ్లీషు గొప్ప దనం ఏమిటంటా? సొంతానికంటూ లిపి ఉందా? పోనీ అంకెలున్నాయా? రోమనుల నుంచి లిపినీ, అరబ్బుల నుంచి అంకెల్నీ అరువు తెచ్చుకున్నార్రా ఇంగ్లీషు వాళ్లు" అన్నాడు రామ్మూర్తి.

"అయినా, నువ్వెట్లా ఇంగ్లీషు లెక్చరరువి అయినావు బావా? ఇంగ్లీషు అంటే ఏ మాత్రం అభిమానం లేదు. పైగా నీ పిల్లల్ని తెలుగు మీడియంలో చదివించడం..." అన్నాడు పళ్లికిలిస్తూ సున్నితంగా అంజిబాబు.

"నాకు ఎప్పటికీ ఇంగ్లీషు భాషంటే ఇష్టమేరా. కాని నీకున్నట్టు పిచ్చిలేదు. ఏ పిల్లలయినా వాళ్ల మాతృభాషలో చదువుకుంటేనే తెలివితేటలు వికసిస్తాయి అని ప్రపంచంలోని విద్యావేత్తలు అందరూ తేల్చి చెప్పిన విషయం. ఈ విషయం గాంధీగారు కూడా ఎప్పుడో చెప్పారు. నా పిల్లలు అమ్మపాలు తాగారు. అమ్మ భాషలోనే చదువుకుంటారు."

'నాక్కాదు పిచ్చి ఇంగ్లీషు విలువ తెలీకపోవడమే నీ పిచ్చి' అంటూ గొణిగాడు అంజిబాబు.

ఇంతలో రానే వచ్చాడు రామ్మూర్తి.

టిఫిన్ చేయడం అవుతూనే - "ఏరా, అంజీ! ఈ పొద్దు నీకేమన్నా ప్రోగ్రాం ఉందా?" అనడిగాడు.

"ఉంది" అంటూ అబద్ధాలు చెప్పేంత చెడ్డవాడు కాదు అంజిబాబు.

గతంలో చాలా మీటింగులకి బావతోపాటు వెళ్లి బలయ్యాడు. అయినా బావకోసం ఈ మీటింగ్‌కి వెళ్లి బలవుతాడు. అదంతే.

బావను స్కూటర్‌పై ఎక్కించుకొని 'కృష్ణకళా మందిరం'వైపు బయల్దేరాడు.

'ఒరే అంజీ! ఈరోజు నేను మాట్లాడబోతున్నది విన్నావంటే, నువ్వు నేలమీద నిలవవు. ఆకాశంలో తేలిపోతావు" అన్నాడు రామ్మూర్తి.

"ఊ" అన్నాడు అంజిబాబు, మరెలా ప్రతిస్పందించాలో తెలీక.

❁ ❁ ❁ ❁

ఉదయం 11 గంటలవుతోంది.

మీటింగు కాసేపట్లో ప్రారంభం కానుంది.

మైకులో 'కవీ, ఓ కళాకారుడా! అటా ఇటా నువ్వు ఎటువైపు' అంటూ ఉద్దీపన గీతం ఆవేశంగా పాడుతున్నాడు ఓ యువ గాయకుడు.

వేదికమీద పదిమంది వక్తలు కూచుని ఉన్నారు. అన్ని కమ్యూనిస్టు గ్రూపుల నేతలూ, ప్రజాసంఘాల ప్రతినిధులూ ఉన్నారందులో, ఒక్క రామ్మూర్తి మాత్రమే ఏ సంస్థకూ చెందని వామపక్ష సానుభూతిపరుడు. అనంతపురం కరువుపై, నీటి వనరులపై పత్రికలకి వ్యాసాలు రాస్తుండడం వల్ల అతన్ని ఎప్పుడూ ఇట్లాంటి కార్యక్రమ నిర్వాహకులు వక్తగా ఎంపిక చేస్తుంటారు.

వక్తల వెనుక 'ప్రపంచీకరణ - పదిహేను సంవత్సరాలు' అన్న బ్యానర్ ఎర్రటి గుడ్డమీద తెల్లటి అక్షరాలతో ఆకర్షవంతంగా ఉంది. హాలు దాదాపు నిండిపోయింది.

ఆ దరిద్రం సభను తిట్టుకుంటూ రెండో వరస చివర్లో కూచుని ఉన్నాడు అంజిబాబు. ఎప్పుడు వీలయితే అప్పుడు సిగరెట్టు తాగే నెపంతో అక్కడినించి జారుకోవచ్చునని.

కార్యక్రమం మొదలయింది...

తెల్లటిచొక్కా పంచెతో ఉన్న బట్టతలాయన ముందుగా మాట్లాడ్డం మొదలు పెట్టాడు. విషయం ఎవరికీ అర్థం కాకుండా ఎంత అద్భుతంగా మాట్లాడగలడో అంత అద్భుతంగానూ మాట్లాడాడు అరగంటసేపు.

ప్రేక్షకుల్లో అసహనం మొదలయింది... మొహాలు వేలాడేసుకుని వినీ వినీ విసుగెత్తి పాతికమంది లేచి గబగబ ఏదో అర్జెంటుగా పని ఉన్నట్టు వెళ్ళిపోయారు.

మొదటి వక్త మాటల్నే కాస్త అటూ ఇటూగా అంతే అద్భుతంగా తక్కిన ఎనిమిదిమందీ మాట్లాడారు. అప్పటికీ అరడజనుసార్లు సిగరెట్టు తాగే నెపంతో బయటికి వెళ్లి వచ్చాడు అంజిబాబు.

సగం హాలు ఖాళీ అయింది మైకాసురుల దెబ్బకి. ఇంకా సగం మంది ప్రేక్షకులు మిగిలి ఉండడం ఆశ్చర్యం వేసింది అంజిబాబుకి.

వక్తల మాటల్లో దోపిడీలూ, సరళీకృత విధానాలూ, స్వేచ్ఛావిపణీ, కార్పొరేట్ ప్రపంచం, లిబరలైజేషన్, ఉత్పత్తుల సజాతీకరణ అన్నవి వినబడుతున్నాయి. తెలుగులో కూడా అర్థం కాకుండా మాట్లాడ్డం చూసి ముచ్చటేసింది అంజిబాబుకి. వీళ్లవల్ల ప్రపంచీకరణకు ఎర్రచీమ తలకాయంత కూడా అపకారం జరగదు కాక జరగదు అన్న ధైర్యం వచ్చేసింది.

చివరి వక్తగా రామ్మూర్తి మైకు ముందుకు వచ్చాడు. తక్కిన ప్రేక్షకుల్లో పదిశాతం మంది నిస్పృహతో, తీవ్ర అసహనంతో లేచి నిలుచున్నారు వెళ్లిపోయేందుకు.

"మిత్రులారా! ఇంతకుముందు మాట్లాడిన వక్తల మాటలు ప్రపంచీకరణకు చెందినవే. అయితే నాకు సరిగా అర్థం కాలేదు. బహుశా నేను ఆ చివర కూచున్నందుకేమో! వినిపించలేదు. క్షమించాలి..." అన్న మాటతో వెళ్లబోతున్న వాళ్లు ఈయన కొత్తగా, కొంత సరదాగా మాట్లాడేట్టు ఉన్నాడురా అనిపించి టక్కున కూచున్నారు.

రామ్మూర్తి ఒకసారి వేదికవైపు తలతిప్పి మొదటి వక్తవైపు చూస్తూ – "రామకృష్ణారెడ్డి గారూ! మీ అబ్బాయి అమెరికాలో కదా ఉంటున్నదీ?" అడిగాడు.

"ఎస్... ఎస్... సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా" చిరునవ్వుతో అన్నారాయన.

"అలాగా... థాంక్యూ!... మరి మీ అబ్బాయి జగన్మోహన్‌రావుగారూ!... మీ అబ్బాయి కెనడాలో – డాక్టరు కదా" అంటూ రెండో వక్తను అడిగాడు రామ్మూర్తి.

"అవునవును. మీకు బాగా జ్ఞాపకం ఉంది"

"థాంక్స్‌సార్... మీ అబ్బాయి ఇంజనీరు, ఆస్ట్రేలియాలో, యామై రైట్ – దేవరాజు గౌడ్ గారూ?" అంటూ మూడో వక్త నడిగాడు.

"రైట్... రైట్" చిరునవ్వులు చిందిస్తూ అన్నాడతను.

అలా వేదిక మీద ఉన్న తొమ్మిది మందినీ పేరు పేరునా పలకరిస్తూ వాళ్ల పిల్లలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా వివిధ దేశాలలో ఎక్కడెక్కడ ఉన్నారో సభకు పరిచయం చేస్తుంటే, వాళ్లందరి మొహాల్లోనూ కొత్త కాంతి! స్టేజీ మీదే తమ తాహతును తెలుపకనే తెలుపుతూ ఉన్న రామ్మూర్తిని కృతజ్ఞతతో చూస్తూ ఉన్నారు.

రామ్మూర్తి ప్రేక్షకులవైపు తిరిగి-

"అయ్యా, నాతోటి వక్తలతోపాటూ అందరికీ నాదో విన్నపం. పిల్లల్ని తెలుగు మీడియం చదివిస్తున్న వాళ్లెందరు ఉన్నారో దయచేసి చేతులు ఎత్తండి..." అంటూ అడిగాడు.

అంజిబాబు ఆసక్తిగా హాల్లోని అందరివైపు కలయజూశాడు. చివర్లో కూచున్న ఒకాయన సిగ్గుపడుతూ ఎత్తాలా వద్దా అని సందేహిస్తూ సగం చెయ్యి ఎత్తాడు. 'ఫూర్ ఫెలో' ఎవరు చదివియ్యమన్నారు... ఇప్పుడు చూడు సిగ్గుపోతుంది' అనుకున్నాడు పురుగుని చూసినట్టు చూస్తూ.

"బాబూ! మీరెవరో సగం ఎత్తిన చేతిని దించేద్దామా అన్న ఆలోచనలో ఉన్నట్టున్నారు. మీరేమీ పొరపాటు చేయలేదండీ మంచి పనే చేశారు. నేను హిందూపురం డిగ్రీ కాలేజీలో ఆంగ్లోపన్యాసకుడినండీ... నా పిల్లలిద్దర్నీ చదివిస్తున్నది తెలుగు మీడియంలోనే..."

అంజిబాబుకు కాస్త సంతోషం వేసింది. ఇప్పుడు నలుగురి ముందు చెప్పుకున్నాడు కదా - సిగ్గు దీస్తారులే... అయినా ఈ 'ప్రపంచీకరణ' మీటింగుకూ, తెలుగు మీడియానికీ ఏమిటి సంబంధం... అంతా అవతారం పనులు కాకపోతే..." గొణుక్కున్నాడు.

ప్రేక్షకులు రామ్మూర్తి ఏం చెప్పబోతున్నాడో ఊహించలేకపోతున్నారు. కానీ, ఏదో ఆసక్తిగానే ఉందే అని ఉత్కంఠతతో వింటున్నారు.

"...ఇప్పుడు మీడియాని గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే - కొంచెం ఓపిక పట్టాలి... తర్వాత మీకే అర్థమవుతుంది. చాలామంది తమ పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలోనే చదివిస్తున్నారు. అక్కడ మొదలయిందండీ ప్రపంచీకరణ - అక్కడే అది వేళ్లూనింది. ఇక్కడ నాదో చిన్న వివరణ. నాకు ఇంగ్లీషు భాషమీద ద్వేషం ఏమీ లేదు. బ్రిటీష్ వాళ్ల మాతృభాష తెలుగు అయివుంటే, వాళ్ల వలస దేశాలలో తెలుగు అధికారం చెలాయించి ఉండేది. ఈరోజు సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచీకరణకు తెలుగు 'వల'ను విసిరే వాళ్లు. ఇంతకుముందే మనవి చేసుకున్నాను. నేను వృత్తిరీత్యా ఇంగ్లీషు లెక్చరరునని. నేను బోధించే భాషపై నాకు అమితమైన ప్రేమ ఉంది, ఉంటుంది, ఉండాలి కూడా. అయితే నాకు వెర్రి వ్యామోహం లేదు...

"... ఇక్కడ అసందర్భమనుకోకుంటే ఒక్క విషయం చెబుతాను. మనదేశంలో అన్ని రాజకీయ పార్టీలకూ విద్యార్థి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో ఉంటున్న విద్యార్థుల్లో మీ పిల్లలు ఎవ్వరూ ఉండి ఉండరు. ఆఖరుకి ఈ వేదిక మీద ఉన్న వారి పిల్లలు కూడా - క్షమించాలి సార్! అయితే ఇందాక చేతులెత్తారే తెలుగు మీడియంలో పిల్లల్ని చదివిస్తున్నాయన... ఆయన పిల్లలు అందులో ఉంటారు. మాతృభాషలో చదువుకున్నవాడే గుంపులో కలిసేతత్వాన్ని కలిగి ఉంటాడు.

పదిమంది కోసం పాటుబడాలన్న జ్ఞానాన్ని కలిగి ఉంటాడు. మరి, ఆంగ్ల మాధ్యమానికి ఆ తత్వం లేదు. అది పిల్లాడిని ఒంటరి బతుకు బతికేలా ప్రేరేపిస్తుంది. దాంతో ఆ మాధ్యమాన్ని చదివే ఏ విద్యార్థీ సంఘాల జోలికి వెళ్లడు. వాళ్లంతా ఎంసెట్లు

పాసయి ఎంబీబీఎస్‌లోనో, బిటెక్‌లోనో చేరిపోవడాలు - అవి పూర్తవుతూనే ఏ అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో స్థిరపడ్డాలు మాత్రమే చేస్తారు. ఇట్లాంటి వీకెండ్ డేస్ - శని, ఆదివారాలు వస్తే ఏ డాబాలోనో, ఏ క్లబ్బులోనో, ఏ బారులోనో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఉంటారు... రేప్పొద్దున ఇట్లాంటి ప్రపంచీకరణ సమావేశాలో, జాతి విపత్తుకు సంబంధించిన సమావేశాలో జరిగితే హాజరయ్యేది - ఎవరు? తెలుగు మీడియం పిల్లలు మాత్రమే...

వేదిక మీద ఉన్న వక్తల వేపుచూస్తూ-

"...అయ్యా, మరోసారి క్షమిస్తే... మీరు నమ్మిన సిద్ధాంతాలకీ, ఫిలాసఫీలకీ కట్టుబడి మీరు ప్రజల దగ్గరకుపోయారు. వాళ్ల కష్టనష్టాలతో మమేకం అయినారు... ప్రజానేతలయినారు. సంతోషం! ఇందులో నాకు ఏ మాత్రం సందేహం లేదు. అయితే, మీరు సంపాదించిన ఆస్తులకి వారసులున్నారు. కానీ, మీ సిద్ధాంతాలకీ, ఫిలాసఫీకీ వారసులున్నారా? దేశంలోని మీలాంటి వారందరి పరిస్థితి ఇదే. అందుకే నేనంటున్నాను - మీరే చివరి మనుషులు అని...

"...ప్రపంచీకరణ మహావృక్షానికి మీరు ఎప్పుడో వేర్లుగా మారారు - మీకు తెలీకనే! ఇప్పుడు మీరు ఈ విషవృక్షం కొమ్మల్నీ, రెమ్మల్నీ నరికేద్దామంటూ ఇట్లాంటి సదస్సులు ఎన్ని నిర్వహించినా ఒక్క ఆకుకూడా పీకలేరు.

సార్! ఇప్పటికయినా మీరు మేల్కొని భాషకి సంబంధించి ఒక విధానం రూపొందించకపోతే - సిద్ధాంతాలు చెప్పేందుకే మీరుంటారు. వినేందుకు జనాలుండరు..."

అంటూ ఆవేశంగా రామ్మూర్తి మాట్లాడుతూ ఉంటే - అంజిబాబు మనసు ఆనందతాండవం చేస్తోంది - నిర్విరామంగా.

ఇక ప్రపంచీకరణ ఆగదు - కమ్యూనిస్టులే కాదు. ఎవరేగాని ఆపలేరు... అంటూ కేకలు పెడదామనుకున్నాడు అంజిబాబు - బావను చూసి అణుచుకున్నాడు.

ఈ పాటికి మీరు అంజిబాబుని చూసే ఉంటారు - మీ మనసు మారుమూలలలో...

● ఆదివారం ఆంధ్రజ్యోతి - *15.10.2006* ●